**1981 సంక్రాంతి కథల పోటీలో రు. 116/-లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ**

**కళ్ళముందు ప్రత్యక్షమైన స్వర్గాన్ని చూసి దిగ్భ్రమ చెందింది శారద. ఆమె కళ్ళలో కని పిస్తున్న ఆనందం, ఆశ్చర్యం నా గుండెల్లో గులాబులు పూయించాయి.**

ఈ క్షణాలలోని ఈ అపూర్వానుభూతి కోసమే ఇన్నాళ్ళూ మన సులో ఎంత తహతహగావున్నా ఈ స్వర్గాన్ని శారదకు చూపకుండా నెట్టుకు వచ్చాను, ఆమెగారి నిష్ఠురాలను కొట్టిపేశాను.

శారద చేతులతో గుండెలు బాదుకోవడం లేదుగానీ ఆ భావం ఆ కళ్ళలో స్పష్టంగా ప్రతిబింబిస్తూ వుంది. నా ఇద్దరు పిల్లలు సంతోషంతో ఇంటి ప్రాంగణమంతా గంతులు వేస్తూ ఎగిరిలే పువ్వుల్లా వున్నారు. ఎవరికి వారే జీవితాశయం నెరవేరినప్పటి ఆనందంతో గృహప్రవేశం చేశాము.

ఆహ్వానితులు ఎక్కువగా లేని కారణంగా ఆ తతంగం చాలా తక్కువ సమయంలోనే ముగిసిపోయింది. ఆ తర్వాత దినమంతా శారద సామగ్రి సర్దుకోవడం లోనే మునిగిపోయింది. ఇంటి కట్టడం లోని ప్రతి విషయంపట్ల శారద సంతృప్తి ఫీలయింది. కాంపౌండులోని మొక్కల మధ్య విశ్రాంతి తీసుకుంటూన్న నా దగ్గరకు పదేసి నిముషాలకోసారి చేసే పని లోంచి వచ్చి ఆ విషయాన్ని విస్తుపోతూ వెల్లడిస్తూనేవుంది.

ఇలు చిన్నదైనా ముచ్చటగా, అందంగా, సదుపాయంగా వుంది చాలా రోజులు ఆలోచించి ఏది యెక్కడ అవసరమో గ్రహించి ఆ యేర్పాటుతో స్వయంగా, దగ్గరుండి కట్టించాను. తోటలేని ఇల్లు నందనవనంలేని స్వర్గంలాంటిది. అందువల్లే ఇలు కట్టడం ప్రారంభించగానే మొక్కలు కూడా నాటించాను. ఇప్పటికి వానిలో కొన్ని రకాలు పూలుకూడా పూస్తున్నాయి.

నా చేతులారా సృష్టించిన ఈ స్వర్గం లోకి శారదను సరాసరి దింపాలని నా చిరకాల వాంఛ. అందువలే కట్టే ఇంటిని చూసానని శారద ఎంత మారాము చేసినా నిర్దాక్షిణ్యంగా త్రోసిపుచ్చుతూ వచ్చాను.

నా కోరిక సంపూర్ణంగా తీరిన ఈ వేళ నా హృదయమనే కలశం ఆనందమనే అమృతంతో నిండినట్టుగా వుంది. ఈ సంతోష శుభ సమయంలోవున్న ఒకే ఒక్క లోటు మా పెదనాన్నగారు లేకపోవడమే. నిజానికి నేనిల్లు కటించిన ఈ ప్లాటు ఆయనదే. చాలాకాలం క్రితం చవగ్గా కొని పడేశారు. ఆయన కోరికమీదే అప్పు చేసే అయినా ఈ ఇలు కట్టగలిగాను.

అప్పు చేసి ఇల్లు కట్టడం నాకు సుతరామూ ఇష్టంలేదు. కానీ "ఇంటి అద్దెలకు వందలు వందలు పోసేకంటే ఇలు కట్టుకుని ఆ పోసేదేదో అప్పులోకి చెల్లు వేస్తూ పోతే కొన్నేళ్ళకైనా నీ ఇల్లు నీకు నిలబడ్తుంది" అని పోరి మరీ మొదలు పెట్టించారాయన. ఆయన పరపతితోటే తక్కువ వడ్డీకి అప్పు పుట్టింది. ఇంకా మిగిలిందానికీ, తగిలిందానికీ శారద ఒంటిమీది కొంత బంగారం, ఇంట్లోని వెండిసామానులాంటివి తోడ్పడ్డాయి. దురదృష్టవశాత్తూ ఇల్లు పూర్తికాకముందే ఆయన స్వర్గస్థులయ్యారు.

ఆ రాత్రి ఆరుబయట నా గుండెలమీద పడుకుని ఆనందభాష్పాలతో మెరిసే కళ్ళతో శారద ఇంటిని ఇంకా ఎలా తీర్చిదిద్దుకోవాలో, ఎలా అలంకరించుకోవాలో పరవశంతో చెబుతూవుంటే నా మనసు అలా అలా గాలిలో తేలసాగింది.

ఉన్నట్టుండి పక్కమంచంమీద పడుకున్న ఐదేళ్ళ మా పెద్దవాడు అడిగాడు. "ఆ చెట్టుమీద అదేంటి నాన్నా?" అని.

వాడు తదేకంగా చూస్తూన్నవైపు చూశాను. ఇంటికి అవతలి వైపు మా కాంపౌండు నానుకునివున్న వేపచెట్టుమీది కాకి గూడు అది. అదే చెప్పాను వాడితో.

"అంటే?" అన్నాడు వాడు.

"అంటే- కాకి తన సంసారం కోసం, తన పిల్లల కోసం కట్టుకున్న ఇల్లు అన్న



నా కథ "కాకిగూడు" కన్సొలేషన్ బహుమతి పొందిన శుభవార్తను తెల్పుతూ మీరిచ్చిన టెలిగ్రాం అందినది. బహుమతి కథలు ఎంపిక చేయటంలోకూడా ఎన్నో పత్రికలు ఎంతో లాలూచీపడుతున్న ఈ దుర్దినాలలో కేవలం సాహిత్యానికీ, సద్ రచనలకూ విలువ నిచ్చి గౌరవించటం మీ పత్రిక నిజాయితీని నిరూపిస్తోంది. సాహితీపరంగా మీ పత్రిక చేస్తూన్న సేవ నిజంగా అభినందనీయమైనది.

జన్మస్థలం : కర్నూలు. పెరిగిందీ, ప్రస్తుతం వుంటున్నదీ కర్నూలులోనే. విద్యాభ్యాసం : కె వి ఆర్ కళాశాల, కర్నూలు. హిందీ విశారదకూడా పాసయ్యాను. ఉద్యోగం: 'ఉజ్వల' వారపత్రికలో సబ్ ఎడిటర్ గా వుంటున్నాను. కర్నూలుజిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘ డైరెక్టర్లలో నాకొకరిని. వివాహమైంది. శ్రీవారు శ్రీనివాసరావుగారికి కర్నూలు జనరల్ హాస్పిటల్‌లో ఉద్యోగం. ఎన్నోకథలు వివిధ వార, మాస పత్రికలలో ప్రచురితం అయ్యాయి, రేడియోలో ప్రసారం అయ్యాయి.

పూలవనం (కథల సంపుటి), హేమంత గానం (నవల). మరుభూమిలో మల్లెతీగలు (ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సీరియల్) తండ్రులూ తీర్పు మీదే (ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సీరియల్), శాంతితీరం (ఆంధ్ర సచిత్ర వారపత్రిక సీరియల్). ఇదేమిన్యాయం (మహిళ మాసపత్రిక సీరియల్). బిందు (వనితాజ్యోతి మాసపత్రిక సీరియల్). కాగితపు పడవలో జీవితపు పయనం (నవల) చీకటి మలుపుల్లో చిరు దీపాలు (నవల)


భవిష్యత్తులోకూడా మీ సహాయ సహకారాలనూ, ప్రోత్సాహాన్నీ ఆశిస్తూ....

—చక్కిలం విజయలక్ష్మి

# కాకిగూడు

– చక్కిలం విజయలక్ష్మి





## "నీకు మొగుడెలా కుదిరాడమ్మా ?"

బందరులో డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు తమ యింట్లో ఒక గది ఖద్దరు షాపు కోసం యిచ్చారు. అవి ఖద్దరు ఉద్యమం తీవ్రంగా కొనసాగుతున్న రోజులు. డాక్టరుగారు అతిగా కృషిచేస్తున్నారా విషయంలో. అందువల్ల ఖద్దరు షాపు యింట్లోనే వుంచి అమ్మకాలు యెక్కువ చేయడంకోసం వారెంతో ప్రయత్నిస్తూ వుండేవారు. షాపులో స్వయంగా కూర్చోకపోయినా, వరండాలోనో, ఎక్కడో వుండి బేరాలకు వచ్చినవారి సంభాషణలు వింటూ వుండేవారు. అవసరమైతే వచ్చినవారికి నచ్చచెప్పే కార్యక్రమంలోకి కూడా దిగేవారు.

ఒక రోజున ఒక ఇల్లాలు వచ్చింది ఖద్దరు చీర కొనడానికి. ఎన్నో చీరలు తీయించి చూసింది. "ఆ చీర అంచు ఈ చీరకు వుంటే బాగుండేది !" "ఆ చీర నేత ఈ చీరకు వుంటే నచ్చేది!" "ఆ పమిటంచు, మరో చీర పక్క అంచులూ

# రసగుళిక

ఈ నెరవు ఉన్న చీరకు ఉంటే నిక్షేపం లాగా వుండేది."

ఇలా ఒక్కొక్క చీరను గురించి తన అభిమతాన్ని, అభిరుచుల్ని వర్ణిస్తోంది. గంటసేపు అలా నడిచింది కాలం. షాపులో వున్న అమ్మకందారుడు ఇంకా నచ్చచెప్పాలని ప్రయత్నిస్తున్నాడు. ఆ సమయంలో పట్టాభిగారు షాపులో ప్రవేశించి, ఇల్లాలిని చూసి "ఏమమ్మా ! నీకు చీర నచ్చలా ! పోనీ గాని నీకు మొగుడెలా నచ్చాడమ్మా ! ఒకడి ముక్కు తీసి, ఒకడి చెవి కోసి, ఒకడి నుదురు జెక్కి, ఒకడి పెదవి పీకి తెచ్చి-ఒక కొత్త వ్యక్తిని తయారుచేసి ఉండాలి నువ్వు. లేకపోతే ఎకాఎకిన ఎవడు నచ్చుతాడు ? ఏడాది కట్టుకొనే చీరకే ఇన్ని రీతులుగా ఆలోచించిన దానవు.... జీవితమంతా ఉంచుకొనే భర్తను అంత తేలిగ్గా అంగీకరిస్తావా !" అన్నారట. ఆ ఇల్లాలు ఎంతో సిగ్గుపడి అక్కడున్న ఒక చీరకు బిల్లు వ్రాయించి తీసుకొని ఎలాగో బయట పడ్డదట.

— పాండురంగారెడ్డి బద్దిగం

మాట. అందులో అవి ఎండ, వాన తగలకుండా హాయిగా, సురక్షితంగా వుంటాయన్నమాట" అన్నాను.

"మనం మన ఇంట్లో వున్నట్టు" అంది శారద.

"ఆ గూట్లోకి వేరే కాకులు రావా నాన్నా!" అని అడిగాడు వాడు. వాడి ఉద్దేశం వేరే కాకులు వస్తే స్థలం ఎలా సరిపోతుందని.

"రావు పక్షుల్లో ఆ నీతి వుంది. అధవా వచ్చినా ఈ కాకి ప్రతిఘటించి తరిమేస్తుంది పక్షులకా శక్తి వుంది" అన్నాను

"అలాగా !" అని వాడు అటు తిరిగి పడుకున్నాడు.

"మీ భాష వాడికర్థమైచస్తుందా యేమిటి !" అని నవ్వింది శారద.

నా చైన స్వర్గమూ, శారద సమక్షమూ ఆ రాత్రి నాకు శివరాత్రి అయింది.

* * *

స్వంత గూటిలో వున్న అనుభూతి మా జీవితాలకు కొత్త కళాకాంతులు తేగా మా సంసారం హాయిగా సాగిపోసాగింది.

జీవితం అలా ఏకబిగిని ఒకేలా సాగిపోతే జీవితంపట్ల మనిషికింత ఆకర్షణ, తాపత్రయం వుండేవే కావు సజావుగా సాగిపోతున్న మా సంసార రథం మూర్తి రాకతో గోతిలో పడ్డటయింది. అమృత కలశంలాంటి నా ఆనందపూరిత హృదయంలో విష బిందువు చిందినట్టయింది

ఆ రోజు ఆఫీసునుంచి చిన్నబోయిన ముఖంతో వచ్చిన నన్ను శారద ఆందోళనగా ఆరా తీసింది.

ఉన్న విషయం ఖిన్న వదనంతో చెప్పాను. శారద తల్లడిల్లి పోయింది "ఇదెక్కడి అన్యాయమండీ !" అంటూ అల్లాడిపోయింది. జారి పోతున్న చేతిలోని స్వర్గంలా ఇల్లును నిళ్ళు నిండిన కళ్ళతో చూడసాగింది.

"మరీ అంత బెంబేలు పడిపోకు. న్యాయం, ధర్మం చెప్పేవాళ్ళు లేరా? మన ప్రయత్నం మనం చేద్దాం" అంటూ శారదకు మేకపోతు గాంభీర్యంతో ధైర్యం చెప్పాను.

న్యాయానికి న్యాయం చేసే చెట్టు కింది న్యాయస్థానాలు అన్యాయమైపోయి ఖరీదైన కోర్టులుగా వెలిశాయి. నలుగురు పెద్ద మనుషులు కూర్చుని న్యాయ నిర్ణయం చేసే కాలం కాదిది. న్యాయవాదుల బల నిరూపణ నిమిత్తం విషయం కోర్టు దాకా వెళ్ళింది.

న్యాయం ఎవరి వైపుందో మనసున్న ప్రతి మనిషికీ ఎరుకే. కానీ మనసు గోడు ఎవడిక్కావాలి? కోర్టుకు చెవులు మాత్రమే వున్నాయి.

జీవితేచ్ఛ నశించిన దీర్ఘరోగిలా నేను, నా కుటుంబం యింటిమీద ఆశ వదులుకున్నాం.

జరిగిందిది :

మా పెదనాన్నగారి ఒక్కగానొక్క కొడుకు మూర్తి. ఇరవై ఏళ్ళక్రితం పధ్నాలుగేళ్ళ వయసులో యింట్లో చిన్న దొంగతనంచేసి యిల్లు వదలి పారిపోయాడు. కొడుకుమీది దిగులుతో పెద్దమ్మ కళ్ళు మూసింది. తల్లిదండ్రులులేని నన్ను నాలోనే తన కొడుకును చూసుకున్నారు పెదనాన్న. తండ్రికంటే ఎక్కువే భావించాను నేను. వృద్ధాప్యంలో ఆయనకు, ఎదుగుతున్న వయసులోని నాకు- ఇద్దరం ఒకరి కొకరం ఆసరా అయ్యాం. మానసికంగా ఆయన నాకిచ్చిన ప్రేమ ఖరీదు కోటకుమించినా, బాహ్యంగా ఆయన నాకిచ్చిన ఆస్తి ఏనాడో నూటయాభై రూపాయలకుకొన్న నాలుగు సెంట్ల స్థలం. ఆ స్థలంలో నన్ను ఇలు కట్టుకోమన్నప్పుడు ఆ స్థలాన్ని నా పేర రిజిష్టర్ చేయించుకోవాలన్న ఆలోచన నాకుగానీ, చేయించాలన్న ఆలోచన ఆయనకుగానీ రాలేదు స్వంత తండ్రీ కొడుకుల మధ్యనున్నలాంటి అనుబంధమే మాలో ఆ 'వేరు' భావాన్ని కలిగించలేదు.

ఇప్పుడు ఆకాశంనుంచి వూడిపడ్డట్టుగా ఎక్కడి నుంచో హఠాత్తుగా వచ్చిపడ్డాడు మూర్తి. అతను మూర్తే. ఆ విషయంలో ఎంతమాత్రం సందేహం లేదు అతని రాక నాకు ఆనందమే కలిగించినా- అతని ధోరణి అంతులేని ఆవేదనకు ప్రోది చేసింది.

తన తండ్రి స్వార్జితమైన ఆ స్థలం, ఆ స్థలంలోని ఇల్లు, చట్టప్రకారంగా, ధర్మసమ్మతంగా తనకు చెందుతాయట. వీలైనంత త్వరలో ఇల్లు ఖాళీచేస్తే సత్రంలో

వుడికేసుకు తింటున్న తన కుటుంబాన్ని రక్షించి నట్లవుతుందట!

చట్టప్రకారం అతను చెప్పింది అక్షర సత్యమే కాని న్యాయం, ధర్మం, మానవత్వం అనేవి వుంటే అతనికి చెందవలసింది కేవలం నూటఏభై రూపాయలే. కానీ నేనలా కూడా అనలేదు. ఇప్పటి రేటు ప్రకారంఆ స్థలానికి ధరకట్టి ఇస్తానన్నాను. తనకంటూ ఇల్లు ఏర్పడేవరకూ ఎన్నాళ్ళయినా, ఎన్నేళ్ళయినా తన కుటుంబంతో మా ఇంట్లో నే ఓవైపు వుండమన్నాను.

"అన్నపు రాసే నాదై వుండగా నీ ముష్టి ఎవడిక్కావాలి!" అన్నట్లుగా ఓ విషపు చూపు చూసి వెళ్ళిపోయాడు.

రాయబారాలయ్యాయి. సహృదయులు సహనం నశించి ఛీత్కరిస్తూ వచ్చారు.

బతిమిలాట లయ్యాయి. బంతిలా తిరిగి నా దగ్గరకే వచ్చాయి- త్వరగా ఇలు ఖాళీ చేయమనే తియగు వారతో.

చివరకు రచ్చకెక్కింది వ్యవహారం.

ఓ రోజు భార్యాపిల్లల్ని తీసుకువచ్చి ఇల్లంతా చూపించాడు మూర్తి.

ఇల్లు గలవాళ్ళు, వాళ్ళ బంధువులను తీసుకువచ్చి తమ ఇల్లు చూపిస్తుండగా ఒదిగి నిలబడ్డ పేషెంట్స్‌లా బిక్కచచ్చిపోయి ఓ మూల నిలబడిపోయారు నా భార్యా పిల్లలు. నా కడుపు తరుక్కుపోయింది. కానీ నేను చేయగలిగింది ఏమీ లేదు. చేయవలసింది అంతా ఇదివరకే చేశాను.

ఇది జరిగాక దింపుడు కల్లపు ఆశలా మళ్ళీ ఓ రాయబారం పెట్టాను "కావాలంటే స్థలం ఖరీదుతోపాటు మరో ఐదువేలు అదనంగా యిస్తా"నని.

"కట్టించుకున్న అపేక్షతో మొత్తం యింటి ఖరీదునే యిసానన్నా నేనా యిలు వదలను అది నా తండ్రి ఆస్తి, ఆవిధంగా అది నా ఆస్తి" అని చెప్పి పంపాడు మూర్తి.

ఆశలన్నీ అడుగంటిపోగా 'తీర్పు' రాకముందే నేను అద్దె కొంప కోసం మళ్ళీ వేట ప్రారంభించాను.

శారద శోకదగ్ధ అయింది!

ఆశ్రమాన్ని వదలి వెళ్తున్న శకుంతలలా ఇంటి అణువణువునూ పరిశీలనగా, పతిత హృదయంతో పరికించి కనీ కాలికిస్తోంది. ప్రాణంపోసి ప్రాణాధికంగా పెంచుకున్న బిడ్డను కసాయివాడి చేతికప్పగించి వెళ్తున్న తల్లిలా తల్లడిల్లి పోతోంది. వెయ్యేండ్ల తపో ఫలాన్ని మూర్ఖుణ్ని శపించేందుకు కోల్పోయిన తాపసిలా తపించిపోతోంది.

శారద బయటపడ్తోంది. నేను బయట పడటంలేదు. అంతే.

కేసులో మెలికలు లేవు. అబద్ధంలా అందంగా. ముక్కుకు సూటిగా వుంది. కాబట్టి ఎక్కువ సమయం తీసుకోలేదు.

నా లాయర్ని చూసి మూర్తి లాయరులేని మీసాలు మెలేశాడు. నిమ్మకాయలు నిలబెట్టే నా లాయరు మీసాలు క్రిందికి వాలిపోయాయి.

"ఫరవాలేదు. కేసు మనవైపు బలహీనంగా వుంది. మీరేం చేస్తారు!" అని నేనే సానుభూతి చూపించాను.

అనుకున్నదే కాబట్టి అఘాతు కలుగలేదు. మరణం ముందుగానే తెలిసిన క్యాన్సరు రోగిలా నిర్లిప్తంగా తీసుకున్నాను.

తీర్పు వచ్చాక ఇక ఒక్క రోజు కూడా ఆ ఇంట్లో మొండిగా వుండాలనిపించలేదు నాకు. శారద ఏదో నణిగిందిగానీ గట్టిగా కసురుకున్నాను.

తెల్లారే ఇల్లు ఖాళీ చేయవలసి వుంది. సామాను సర్దేసి అభోజనంగా పక్కల మీద వాలాము. నా ఇద్దరు పిల్లల దగ్గర నుంచీ అందరి మనసుల్లో చెప్పలేని అలజడి. జీవితంలో మేము చేయాలనుకున్న పనిని ఎన్నో శ్రమ దమాల కోర్చి పూర్తి చేసుకుని ఆ ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ పూర్తిగా, పరిపూర్ణంగా అనుభవించకముందే నోటి దగ్గరి ముద్దను గద్ద తన్నుకుపోయినట్టుగా అయింది! కటడం జరుగుతున్న రోజుల్లో మేము ఎన్ని అగచాట్లు పడ్డామో, ఎన్ని అవసరాలు మానుకున్నామో ఒక్క దేవుడికే తెలుసు. మా అగచాట్లు, ఆ తర్వాతి మా ఆనందం అంతా బూడిదలో పోసిన పన్నీరయింది.

మా దుఃఖాన్ని తానూ పాలు పంచుకుంటూన్నట్లుగా ప్రకృతికూడా ప్రళయ భయంకరంగా రోదించింది రాత్రంతా.

తెల్లవారింది. మేము బయలు దేరకముందే మూర్తి కుటుంబంతోసహా వచ్చి దిగాడు. వాళ్ళ ఆనందం, ఉత్సాహం అలాంటివి.

ఒంపెద్దు బండిమీద సామానంతా చేరేశాము. శారద ముచ్చటపడి, ఆలోచించి, ఆనందంగా ఆడుతూ పాడుతూ సర్దుకున్నంత సేపు పట్టలేదు సామానుతీయడం.

నేస్తుల్లా ఒకరిముఖాలొకరం చూసుకోడానికికూడా భయపడిపోతున్నాం.

మూర్తి చాలా సాదరంగా వీడ్కోలిచ్చాడు.

యుద్ధ భయంతో మాతృభూమిని వదలి వెళ్తున్న కాందిశీకుల్లా గేటు దాటి బయటకు వచ్చాము

రాత్రి గాలివానకు ఇంటి బయటున్న వేపచెట్టు కూకటివేళ్ళతో కూలిపోయింది జీవితంలోని మా ఆశలా. చెట్టుతోపాటు చెటుమీది కాకిగూడు కూడా నేలపాలయింది. అంతటి నా బాధలోనూ కుతూహలంగా చూశాను గూటిలోకి.

ఏవో పిల్లలు, నలగా వున్నాయి. చిన్న గొంతుకలతో కిచకిచమని అరుస్తున్నాయి.

కాకి పిల్లల్లా లేవు! ఆశ్చర్యంతో మరింత పరిశీలనగా చూశాను. అప్పుడు గుర్తొచ్చింది అవి కోకిల పిల్లలని! కోకిలకు సొంత గూళ్ళు నిర్మించుకునే శక్తి, ఆసక్తి వుండదు. కాకి నిర్మించుకున్న గూటిలో, కాకి పరోక్షంలో గుడ్లు పెట్టి పోతాయి. కాకి గూట్లోనే అవి పిల్లలై, రెక్కలు వచ్చేదాకా రక్షణ పొందుతాయి!

నేను నిర్మించుకున్న నా ఇంటి కేసి పిచ్చిగా చూశాను.

నా ఇంట్లో మూర్తి పిల్లలు కేరింతలు కొడుతున్నారు!

